క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు



కేవీజీ సత్యనారాయణను కలిసిన యువకులు

సరుబుజ్జిలి: ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ అన్నారు. పురుషోత్తపురం పంచాయతీకి చెందిన కొంతమంది యువకులు ఆదివారం సత్యనారాయణను గ్రామంలో కలిశారు. పంచాయతీలోని సీతారామన్‌నగర్‌కాలనీ, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించడం జరుగుతుందని వెల్లడించారు.

వ్యక్తికి పాము కాటు



బుల్లోడికి వైద్య సేవలందిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సారవకోట: మండలంలోని రైవాడ సమీపంలో గొర్రెల మంద వద్ద అలుదు గ్రామానికి చెందిన ఆవల బుల్లోడు పాము కాటుకు గురయ్యాడు. మేకలు, గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. మొక్కల్లో ఉన్న పాముపై కాలు పడటంతో కాటు వేసింది. సారవకోట పీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నరసన్నపేట ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కొత్తూరు: విద్యారంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు అన్నారు. మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ సభ్యుడు ఆర్.కొండలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాధవరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. బదిలీలు, కౌన్సెలింగ్, అప్రెంటిషిప్ రద్దుతోపాటు పలు సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా విధానాల వలన రాష్ట్రంలో సుమారు 20 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిన దుస్థితి నెలకొందన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ నాయకులు వి.మధు, శోభన్‌బాబు, వీరభద్రయ్య, లక్ష్మి, నారాయణరావు, దినేష్, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

నీలమణిదుర్గ ఆలయానికి భక్తుల తాకిడి



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణం మాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు చేశారు.

నేడు శిక్షణ తరగతులు ప్రారంభం

పాతపట్నం: మండలంలోని అంతరాబ కూడలి సమీపంలో ఉన్న కొరికాన కాంపిటేటివ్ అకాడమీలో కొరికాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరుద్యోగ యువతి, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఇవ్వనున్న ఉచిత శిక్షణ తరగతులను సాయంత్రం 3 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ మేరకు కొరికాన భవానీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులను శ్రీకాకుళం జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కొరికాన రవికుమార్ ప్రారంభిస్తారన్నారు. ఉచిత శిక్షణ తరగతులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిజర్వాయర్ ఇలా..

సాగునీరు ఎలా?



గుర్రపుడెక్కతో నిండిన కొత్తకోటమినీ రిజర్వాయర్

- నిండా గుర్రపుడెక్క
- బలహీనపడిన రిజర్వాయర్ గట్టు
- చేసిన పనులు వృథా
- సాగునీటి ప్రవాహానికి ఆటంకం
- అవస్థలు పడుతున్న రైతులు

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట ఎగువ భాగాన సుమారు 163 ఎకరాల విస్తీర్ణంలోని కొత్తకోట పెద్దచెరువును మినీ రిజర్వాయర్‌గా గుర్తించారు. 2006లో సుమారు రూ.43 లక్షల అంచనాల వ్యయంతో కొత్తకోట పెద్దచెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దేందుకు అప్పట్లో నిధులు మంజూరు చేశారు. రిజర్వాయర్‌ను అభివృద్ధి చేసిన తరువాత వంశధార కుడి ప్రధాన కాలువ ఇన్‌ఫ్లో నుంచి వచ్చిన సాగునీరు వృథాగా పోకుండా నిల్వ చేసి అవుట్‌ఫ్లో ద్వారా వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 850 ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగునీరందించడంతోపాటు, దకరవలస ఎత్తిపోతల పథకానికి నీరు అందించడమే లక్ష్యం.

పేరుకుపోయిన గుర్రపుడెక్క..

ఇటీవల చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికను తొలగించే పనులు అధికారులు చేయించారు. చేసిన పనుల వలన రైతన్నలకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. పనులు చేసిన కొద్దిరోజులకే మరలా ఎగువ ప్రాంతం నుంచి గుర్రపుడెక్క రిజర్వాయర్‌లో చేరింది. దీనివలన సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దకరవలస ఎత్తిపోతల పథకానికి కూడా సాగునీరు అందడం లేదు.

గండిపడే అవకాశం..

చెరువును రిజర్వాయర్‌గా తీర్చిదిద్దాలంటే ముందుగా నీటిని స్టోరేజీ చేసేందుకు గట్టును పటిష్టం చేయాలి. ప్రస్తుతం గట్టు పూర్తిగా ఎక్కడిబడితే అక్కడ మట్టి కరిగిపోయి బలహీనపడింది. వాటర్ స్టోరేజీ సమయంలో గట్టు భద్రతకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

పరిశీలన చేపడతాం

ఇటీవల కాలంలో కొత్తకోట మినీరిజర్వాయర్‌లో పూడికతీత, మరమ్మతు పనులు చేపట్టాం. పైనుండి మరలా గుర్రపుడెక్క రావడంతో ఇబ్బందులు వస్తున్నాయి. వెంటనే తొలగించే చర్యలు తీసుకొంటాం.

– శ్రీనివాసరావు, డీఈ, వంశధార



బలహీనంగా ఉన్న చెరువు గట్టు

సాగునీరు అందాల్సిన గ్రామాలు..

కొత్తకోట రిజర్వాయర్ ద్వారా కొత్తకోట, దకరవలస ఎత్తిపోతల పథకం ద్వారా చిగురువలస, దకరవలస, కొండ్రగూడ, నక్కలపేట, బురిడివలస, రావివలస, తదితర గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందించాలి. రిజర్వాయర్ నిర్వహణలో లోపాల వలన సాగునీటి పంపిణీలో ఆయా గ్రామాల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ముందస్తు ప్రణాళికలు అవసరం..



కొత్తకోట రిజర్వాయర్ నిర్వహణ కోసం అధికారులు ముందుగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాలి. చెరువుగట్టు బలహీనంగా ఉంది. నీరు స్టోరేజ్ సమయంలో గట్టుకు ప్రమాదం వాటిల్లవచ్చు. గట్టుపై గ్రావెల్ వేసి రోలింగ్ చేస్తే బలపడే అవకాశాలున్నాయి. రెండు పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– సురవరపు నాగేశ్వరరావు, రైతు, కొత్తకోట

ఎత్తిపోతల పథకానికి ఇబ్బందులు



మినీ రిజర్వాయర్ విషయంలో ప్రభుత్వ లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. సక్రమంగా నీరు ప్రవహించక దకరవలస ఎత్తిపోతల పథకం పనిచేయడం లేదు. దీనివలన ప్రతీ ఏటా రైతులు సాగునీటి అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– చల్ల యర్రయ్య, రైతు, చిగురువలస

పలు కుటుంబాలకు పరామర్శ..

నరసన్నపేట: స్థానిక సర్పంచ్ బూరల్ల శంకర్ తండ్రి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సర్పంచ్ కుటుంబాన్ని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ నాయకులు బొబ్బాది ఈశ్వరరావు, పాగోటి భరద్వాజ్ ఉన్నారు.

సారవకోట మండలంలో..

సారవకోట: మండలంలోని పలు కుటుంబాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం పరామర్శించారు. అలుదు గ్రామానికి చెందిన పాగోటి నారాయణరావు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, మాకివలస గ్రామానికి చెందిన నక్క సాయికుమార్ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, కేశవలస గ్రామానికి చెందిన చిన్నాల దాలయ్య మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, పార్టీ నాయకులు ధర్మాన రామకృష్ణ, కత్తిరి అప్పలనాయుడు, కళ్యాణం శ్రీనివాసరావు, రెడ్డి పాపయ్య తదితరులు ఉన్నారు.



సారవకోట: పాగోటి నారాయణరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణచైతన్య

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు

నరసన్నపేట: స్థానిక కలివరపుపేటలోని షిర్డీ సాయి బాబా ధ్యాన మందిరం 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. స్వామి వారికి పాలాభిషేకం చేపట్టారు. దాతలు ఇచ్చిన విరాళాలతో మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వైశ్యరాజు సదానందం, పొట్నూరు నీలం, వైఎస్సార్‌సీపీ నాయకుడు కేసీహెచ్‌బీ గుప్త, తదితరులు పాల్గొన్నారు.



షిర్డీ సాయి విగ్రహానికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

కొబ్బరి మొక్కల పంపిణీ



కొబ్బరి మొక్కలు తీసుకువెళ్తున్న మహిళలు

నరసన్నపేట: వ్యవసాయం అంటే మక్కువ, మొక్కలు అంటే ప్రీతి కలిగిన కంబకాయకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పాగోటి అప్పలనాయుడు, ఉమామహేశ్వరి దంపతులు 500 కొబ్బరి మొక్కలు పంపిణీ చేసి తమ అభిమతాన్ని చాటుకున్నారు. వీరి కుమారుడుకి వివాహం నిశ్చయమైంది. ఆదివారం కంబకాయలోని స్వగ్రామంలో గోదుమరాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలకు పిలిచారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ మర్యాద పూర్వకంగా ఒక గిఫ్ట ఇస్తుంటారు. ఈ గిఫ్టుకు బదులు తాంబూలంతో పాటు ఒక్కో కొబ్బరి మొక్కను అందజేశారు.

సంపద సృష్టించని కేంద్రాలు



నిరుపయోగంగా ఉన్న నరసన్నపేట పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డు

- కేంద్రాలకు చెత్త రాదు.. ఎరువు తయారీ కాదు
- చెత్త నుంచి సంపద ఒట్టిమాటే
- నిరుపయోగంగా ఎస్‌డబ్ల్యూపీసీలు
- నరసన్నపేటలో నియోజకవర్గంలో 114 చోట్ల ఎస్‌డబ్ల్యూపీసీల నిర్మాణం

నరసన్నపేట: చెత్తను సేకరించి దీంతో వర్మీకంపోస్టు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం తీసుకురావాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు ఆశయానికి దూరంగా ఉన్నాయి. లక్షలు ఖర్చు చేసి పంచాయతీల్లో నిర్మించిన కేంద్రాలు నిరుపయోగంగా ఉంటూ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. సేకరించిన చెత్త కేంద్రాలకు రావడం లేదు. సంపద సృష్టి అంతకన్నా లేదు. చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణం ద్వారా ప్రజాధనం లక్షల్లో వృథా అయింది. ప్రతీ గ్రామ పంచాయతీల్లో చెత్తనుంచి సంపద కేంద్రాలను (రేకుల షెడ్) నిర్మించారు. నిర్మించిన అన్ని చెట్లా ఈ కేంద్రాలు ఆశయానికి ఆమడ దూరంలో ఉన్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తి స్థాయిలో అధికారులు వీటిపై దృష్టి సారిస్తే కొన్ని చోట్ల అయినా ఎస్‌డబ్ల్యూపీసీలు వినియోగంలోనికి వచ్చేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.



సంపద లేని దేవాది చెత్త సేకరణ కేంద్రం



నడగాంలో నిరుపయోగంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

నరసన్నపేట నియోజకవర్గంలో 140 పంచాయతీలున్నాయి. వీటిల్లో 114 చోట్ల కేంద్రాలు నిర్మించారు. దాదాపుగా అన్నిచోట్ల ఒకటే పరిస్థితి. నరసన్నపేట వంటి మేజరు పంచాయతీలోని కేంద్రం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. సుమారు రూ.40 లక్షలు వెచ్చించి జాతీయ రహదారికి ఆనుకొని డంపింగ్ యార్డ్ నిర్మించారు. రోడ్డు, ప్రహరీ వంటి సదుపాయాలు కల్పించారు. మండలంలోని దేవాది, ముద్దాడపేట, కరగాం, తామరాపల్లి, జమ్ము ఇలా అన్నిచోట్లా ఒకటే పరిస్థితి. ఎక్కడా పైసా ఆదాయం వచ్చే పరిస్థితి లేదు. దీంతో సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. మండల కేంద్రాలైన జలుమూరు, సారవకోట, పోలాకిలో కూడా సంపద కేంద్రాలు వెలవెలబోతున్నాయి. గ్రామాల్లో చెత్త సేకరణ గతంతో పోల్చితే బాగా జరుగుతుంది. ఈ చెత్త ద్వారా సంపద మాత్రం రావడం లేదు. సేకరించిన చెత్తను తగిన విధంగా వినియోగించడం లేదు.

నరసన్నపేట నియోజకవర్గంలో ఎస్‌డబ్ల్యూపీసీల వివరాలు ఇలా..

మండలం	నరసన్నపేట	జలుమూరు	పోలాకి	సారవకోట
పంచాయతీలు	34	40	31	35
ఎస్‌డబ్ల్యూపీసీలు	30	33	28	23

వినియోగంలోనికి తీసుకురావాలి



గొట్టిపల్లి పంచాయతీలో రెండు చోట్ల చెత్తనుంచి సంపద కేంద్రాలు నిర్మించాం. వీటిని వినియోగలోనికి తీసుకురావాలి. పంచాయతీలకు తగిన సూచనలు చేసి సద్వినియోగం చేయించాలి. చెత్త సేకరణ బాగా జరుగుతుంది. సంపద మాత్రం సృష్టించలేక పోతున్నాం.

– అవ్వ రవీంద్రనాథ్, సర్పంచ్ గొట్టిపల్లి, నరసన్నపేట మండలం

స్థలం పరిశీలన చేశారు..



మండలంలో పెద్ద పంచాయతీల్లో రెండోది అయినా ఉర్లాంలో ఇప్పటి వరకు ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణం జరగలేదు. ఇటీవల తహసీల్దార్ వచ్చి స్థల పరిశీలన చేశారు. స్థలం కేటాయించి ఉత్తర్వులు ఇచ్చి నిధులు మంజూరు చేస్తే నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. మాలాంటి పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ అవసరం ఉంది.

– పోలాకి నర్సింహామూర్తి, సర్పంచ్, ఉర్లాం, నరసన్నపేట మండలం

వినియోగంలోనికి తీసుకువస్తాం



మండలంలోని 34 పంచాయతీల్లో 30 చోట్ల ఎస్‌డబ్ల్యూపీసీలు ఉన్నాయి. మరో నాలుగు చోట్ల నిర్మించాల్సి ఉంది. నిర్మించిన కేంద్రాలను సద్వినియోగం చేసేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులకు దీనిపై ప్రత్యేక అవగాహన కల్పించి, చెత్త నుంచి సంపద వచ్చేలా కృషి చేస్తాం.

– కె.వి.ప్రసాద్, ఎంపీడీఓ, నరసన్నపేట

సరుబుజ్జిలి: సరుబుజ్జిలిలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు



మోసం చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలందరినీ మోసం చేశారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ తెలిపారు. మండలంలోని కొండ్రగూడ, సరుబుజ్జిలి గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, రికాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను అందించి, కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సురవరపు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, సరుబుజ్జిలి సర్పంచ్ చాందిని, పున్నపురెడ్డి తవిటినాయుడు, బద్రి రామారావు, యడ్ల ఈశ్వరరావు, మూడడ్ల రమణ, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వైఫల్యాలను ఎండగట్టాలి

బూర్జ: సీఎం చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని అన్నంపేట, సింగన్నపాలెం, పి.ఎల్.దేవిపేట, నీలాదేవిపురం (నీలంపేట) గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మేనిపెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు సీఎం చంద్రబాబు చేసిన మోసాలను చింతాడ రవికుమార్ వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎం.కిరణ్ కుమార్, మండల యువజన అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేష్ దొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బూర్జ: పి.ఎల్ దేవిపేటలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

కూటమి మోసాలను వివరించాలి..

ఆమదాలవలస రూరల్: సీఎం చంద్రబాబు, కూటమి నాయకుల మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస మండల కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు అన్నారు. మండలంలోని వంజంగి, వంజంగిపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: వంజంగిలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డ్రైనేజీ మధ్యలో విద్యుత్ స్తంభం



సారవకోట మండల కేంద్రంలోని ఆఫీషియల్ కాలనీలోని మురుగు నీటి కాలువ మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటంతో మురుగు నీరు కిందకు వెళ్లేందుకు అవకాశం లేక నిల్వ ఉండి పోతుంది. వ్యాధులను వ్యాపింపజేసే దోమలు, ఈగలు పెరుగుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ వీధికి వెళ్లే ప్రారంభంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉండటంతో ఆటోలు సైతం వచ్చే అవకాశం లేదు. దీనిపై మండల స్థాయిలో జరిగే గ్రీవెన్స్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశారు. శనివారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

– సారవకోట

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



మెళియాపుట్టి మండలంలోని జాడుపల్లి నుంచి సుర్జిని గ్రామానికి వెళ్లే రహదారిలో ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవటంతో అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిలో గ్రామానికి చేరుకోవాలంటే నరకం చూడాల్సిన పరిస్థితి. రోజురోజుకీ పిచ్చిమొక్కలు రహదారిని కప్పేస్తున్నాయని, అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరుతున్నారు.

– మెళియాపుట్టి

ముక్కు మూసుకోవాల్సిందే..



ఈ చిత్రం మెళియాపుట్టి మండలంలోని జలకలింగుపురం పెద్ద వీధిలో ప్రవహిస్తున్న మురుగు నీరు. మురునీటి కాలువలు కొంత కాలం క్రితమే మూసుకుపోయాయి. ఇళ్లల్లోని వాడుక నీరు వీధిలోనే ప్రవహిస్తోంది. దుర్గంధంతో ముక్కుమూసు కోవాల్సి వస్తోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని పెద్ద వీధి వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పంచింది మురుగునీటి కాలువలను బాగుచేయాలని కోరుతున్నారు.

– మెళియాపుట్టి

వరుస పద్ధతిలో వరి నాట్లు వేయాలి

సారవకోట: వరి నాట్లు వరుస పద్ధతిలో వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ రమణ సూచించారు. మండలంలోని గుమ్మపాడులో కత్తిరి మీనాక్షికి చెందిన పొలంలో వరుస పద్ధతిలో వరి నాట్లు వేసే విధానంపై ఆదివారం అవగాహన కల్పించారు. వరుస పద్ధతిలో వరి నాట్లు వేసుకోవడం వలన అధిక దిగుబడి వస్తుందన్నారు.